www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 03 | మే | 2025
పేజీలు 8

## పంట మార్పిడితో నష్టాలను తగ్గించవచ్చు



-ఆయిల్ పాం వంటి లాభసాటి పంటలను సాగు చేయాలి
-దెబ్బతిన్న బొప్పాయి తోటలను పరిశీలించిన మంత్రి తుమ్మల

2లో

# రైతు వ్యథ తీరేదెన్నడో..!



-నెల రోజులుగా ధాన్యం రాసుల మధ్యే
-ధాన్యం కొనరు.. కొంటే కోతలు
-శాపంగా మారిన అధికారుల ఉదాసీనత



**ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనే నాధుడు లేక రైతన్న తీవ్ర అవస్థలు పడుతున్నాడు.** పండించటం కంటే ధాన్యాన్ని విక్రయించటం రైతుకు తలకు మించిన భారంగా మారింది. నెల రోజులుగా కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కొనేనాధుడు లేక అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తిరగగా తిరగగా కాటాలు వేయటం జరుగుతుంది. కాటాలు వేసిన తర్వాత మిల్లుల వద్దకు వెళితే క్వింటాకు ఐదు నుంచి 15 కేజీల వరకు కోత పెడుతున్నారు. ఇది చాలదన్నట్లు ప్రతి రోజు ఉరములు, మెరుపులతో కూడిన వర్షం. ధాన్యం పండించిన రైతు పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ వ్యథ తీరేదెన్నడో...

-ప్రజాపక్షం/ఖమ్మం ప్రతినిధి

2లో

## ఆపరేషన్ కగార్‌ను
# వెంటనే నిలిపివేయాలి





-మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
-ఖమ్మంలో మానవహారం

**ప్రజాపక్షం/ఖమ్మం :** కగార్ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలని దేశంలోనే జీవించే హక్కును హరించి వేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని మార్చుకోవాలని వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మిగతా 2లో..

# ఆర్టీఏలో నోటి దురుసు అధికారి..!



**ప్రజాపక్షం/ఖమ్మం(బైపాస్‌రోడ్) :** ఖమ్మం ఆర్టీఏ కార్యాయంలో ఆయనో జిల్లా ఉన్నతాధికారి. నక్కతోక తొక్కకుండానే అదృష్టంతో తాత్కాలిక పదోన్నతి బాధ్యత లభించింది. కానీ దానికి ఉన్న విలువను తీస్తు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాడు. ఉన్నత స్థాయిలో ఉన్నతంగా ఆలోచించాల్సింది పోయి నోటి దూలను ప్రదర్శిస్తూ తలనొప్పిగా మారాడు. గతంలో కింది స్థాయిలో వెలగబెట్టిన విధులనే జిల్లా కార్యాలయంలో కనబరుస్తున్నాడు. ఆ సార్ గారి తీరుతో కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బంది

మిగతా 2లో..

- ఆయనంటేనే హడలిపోతున్న కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది
- కార్యాలయానికి వచ్చే వినియోగదారులతోనూ అదే తీరు
- మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి మందలించినా మారని తీరు
- తీవ్ర చర్చనీయాంశమవుతున్న సార్ శైలి..?

# రైతు వ్యథ తీరేదెన్నడో..!

ప్రజాపక్షం/ఖమ్మం ప్రతినిధి : ధాన్యం పండించిన రైతు పరిస్థితి దయనీయంగా మారింది. పండించేటప్పటి కంటే అమ్ముకునేటప్పుడు ఎక్కువ అవస్థలు పడుతున్నాడు. యాసంగి ధాన్యం కొనుగోలుకు సంబంధించి కొనుగోలు కేంద్రాలు తెరిచామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ ఏడాది దిగుబడి బాగా వచ్చిందన్న ఆనందం ఆవిరై ఇప్పుడు అకాల వర్షంతో పాటు రైతాంగం కండ్లు వర్షిస్తున్నాయి. కల్లాల్లోకి చేరి నెల రోజులు గడిచినప్పటికీ ధాన్యం కాటాలు తరలించేందుకు సరైన ఏర్పాట్లు లేవు. కాటాలు వేయడానికి గోనె సంచులు అందుబాటులో ఉండడం లేదు. తీరా కాటాలు వేస్తే లారీలు లేక మిల్లులకు తరలించే ప్రక్రియ ఆలస్యమవుతుంది. కాటాల దగ్గర నుంచి మిల్లు తరలింపు వరకు రైతు బాధ వర్ణాతీతం.

**మిల్లుకు వెళితే కోతలు...**

రైసుమిల్లులకు ధాన్యం తరలించిన మిల్లర్లు కాటాల్లో కోతలు విధిస్తున్నారు. కల్లాల్లో తేమ శాతం చూసి ఆ తర్వాతనే కాటాలు వేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం ఉన్నప్పుడే కాటాలు వేసిన తర్వాతే కోతలు ఎందుకన్న రైతుల ప్రశ్నకు సమాధానం చెప్పేవారు కరువయ్యారు. అధికారుల ఉదాసీనత రైతుల పాలిట శాపంగా మారింది. మిల్లర్లు తాము నోటికి వచ్చిందే అన్నట్లుగా కోత విధిస్తున్నారు. క్వింటాకు ఐదు నుంచి 15 కేజీల వరకు కోత విధిస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించ వచ్చు. మిల్లర్లు విధిస్తున్న కోతల గురించి ఏ అధికారి నోరు మెదపడం లేదు. అధికారులు స్పందించక పోవడంతో రైతు మిల్లర్ల డిమాండ్‌కు తల వంచక తప్పనిస్థితి ఏర్పడింది.

**అకాల వర్షాలు...**

గడిచిన 10 రోజులుగా ప్రతి రోజు ఏదో ఒక చోట ఏదో ఒక సమయంలో వర్షం పడుతూనే ఉంది. ధాన్యం తడవకుండా చేసేందుకు రైతులు నానా ఇబ్బందులుపడుతున్నారు ఈదురు గాలులు, వర్షంతో ప్రతి రోజు రైతుకు తిప్పలు తప్పటం లేదు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కొనుగోళ్లు వేగవంతం చేయండి అన్న ప్రకటనలకు పరిమితం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. పండించటమే శాపంగా మారిందన్న రైతు ఆవేదనకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉంది.

# పంట మార్పిడితో నష్టాలను తగ్గించవచ్చు



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : పంటమార్పిడి విధానంతో అకాల వర్షాల నష్టాలను తగ్గించవచ్చునని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అకాల వర్షాల వల్ల దెబ్బతినని ఆయిల్ పాం వంటి లాభసాటి పంటలను రైతులు సాగు చేయాలని మంత్రి తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండలం సూర్యాతండాలో అకాల వర్షం తీవ్ర గాలులకు దెబ్బతిన్న బొప్పాయి తోటలను ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మలనాగేశ్వరరావు మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రాష్ట్రంలో ఇప్పటికే 25వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. గత రెండు మూడురోజులుగా కురిసిన రాళ్ల వాన, అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటలపై కలెక్టర్లు నివేదిక పంపాలని మంత్రి తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు తాత్కాలిక సహయం అందిస్తూ ఏప్రిల్, మే నెలలో వచ్చే రాళ్ల వానాలకు పంట నష్టపోకుండా ఉండాలంటే ఆ కాలంలో తగిన పంటలు సాగు చేయాలని తెలిపారు. బొప్పాయి, మిర్చి , మొక్కజొన్న వంటి పంటలు నష్టపోతున్నాయని ప్రభుత్వం అందించే పరిహారం సరిపోవడం లేదన్నారు. రైతులు నష్టపోకుండా ఉండాలంటే పంటలు మార్చుకోవాలని మంత్రి సూచించారు. ఆయిల్ పాం వేసిన రైతులు అకాల వర్షాలతో నష్టపోవడం లేదని రైతులందరూ ఆలోచించి లాభసాటి పంటలను సాగు చేయాలన్నారు. పంటల మార్పిడి విధానం తప్పని సరిగా అమలు చేయాలన్నారు. నష్టం జరిగిన రైతులకు తాత్కాలికంగా ప్రభుత్వం తరుపున సాయం అందిస్తామని భవిష్యత్తులో ఇటువంటి నష్టాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి ఎంవి మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టిఏలో నోటి దురుసు అధికారి..!

(మొదటిపేజీ తరువాయి)

హడలెత్తిపోతున్నారు. అదే వైఖరినే కార్యాలయానికి వచ్చే వినియోగదారులపై చూపిస్తూ పైశాచిక ఆనందం పొందుతూ..నేనేరాజు నేనేమంత్రి అనేలా వ్యవహరిస్తున్నాడు. దీంతో బాధ్యతకు, కార్యాలయానికి చెడ్డ పేరు తెస్తూ..వన్నె తగ్గిస్తున్న తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా...ఏజెంట్లను కట్టడి చేసి పారదర్శకతకు బాటలు వేశానని చెప్పుకుంటూ.. తన అడుగులకు మడుగులొత్తే ఏజెంట్లకు మాత్రం వెసులుబాటు కల్పిస్తుండటం విశ్మయానికి గురి చేస్తుంది. ఈ నేపథ్యంలో ఇంకా ఎన్నాళ్లు ఈ తాత్కాలిక గోసపడాలోనని ఉద్యోగులు, సిబ్బంది ఆందోళనకుగురువుతున్నారు. సదరు సార్ మాత్రం నేనే దైవాంస సంబూతుడిని అంటూ ఇష్టరాజ్యంగా తన దురుసు ప్రవర్తనను కనబరుస్తునే ఉన్నాడు.

**ఆ సార్ తీరుతో హడల్...**

ఆ అధికారి తీరుతో ఆ శాఖలో పనిచేస్తున్న కింది స్థాయి, కొందరు ఉన్నత స్థాయి ఉద్యోగులు, సిబ్బంది హడలెత్తిపోతున్నట్లు సమాచారం. అక్కడ పనిచేసే ఉద్యోగస్తులందరిలో ఆ అధికారి తీరు భిన్నంగా ఉందని ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఆయన జిల్లా స్థాయి అధికారిగా భాధ్యతలు వెలగబెడుతుండటంతో అంతా ఆయన చెప్పిన విధంగా జరగాలని హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం. ఎవరైన ససేమేరి అంటే వారిని టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేసి దారికి తెచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది. మోనార్క్‌ల వ్యవహరిస్తూ కింది స్థాయి సిబ్బందిపై తరచు కస్సు బస్సులాడుతుంటాడనే ఆరోపణలు ఉన్నాయి. సదరు సార్ నిర్వహిస్తున్న బాధ్యతల సమయంలో చోటు చేసుకుంటున్న తప్పిదాలపై సీనియర్లు సలహాలిచ్చిన పెడచెవిన పెట్టి ఇష్టానుసారంగా వ్యాఖ్యానాలు చేస్తాడని వినికిడి. మీకంటే ఎక్కువ విషయాలు తనకే తెలుసు అన్న దోరణిని కనబరుస్తూ ఒంటెద్దు పోకడలు కనబరుస్తున్నట్లు సీనియర్లు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో ఎలాగో మంచి చెప్పిన వ్యంగ్యంగానే మాట్లాడేటప్పుడు మనం ఎందుకు కలగచేసుకోవాలని మిన్నకుంటున్నట్లు ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది. ఈ పోకడలతో గతంలో ఎన్నడు లేనివిధంగా ఆర్టిఏ కార్యాలయం ఆ సార్ తీరుతో పలు ఆరోపణలు ఎదుర్కుంటుందటే పరిస్థితి ఎలా ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

**అడుగులకు మడుగులొత్తే ఏజెంట్లకే...**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వినియోగదారులకి పారదర్శకంగా సేవలు అందిస్తూ ఏజెంట్లను కట్టడి చేసేనని ప్రగల్భాలు పలుకుతున్నాడు. ఇది నానేనికి ఒక వైపులాగా.. మరోవైపు తన ద్వంద బుద్ధిని చూపిస్తున్నాడు. స్వామికార్యంతో పాటు స్వకార్యం చూసుకునే కొందరు ఏజెంట్లతో చీకటి స్నేహం కదుర్చుకొని వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆరోపణల వినిపిస్తున్నాయి. ఇలా అడ్డగోలు వ్యవహారాలను ఇష్టారాజ్యంగా కనబరుస్తూ ఆడిందే ఆట పాడిందే పాటగా నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన ఓ వ్యాపారి తమ కార్ల రిజిస్ట్రేషన్లకు రాగా..తన సహజ సిద్ధమైన నోటి దూలను ప్రదర్శించాడు. దీనిపై కోపోద్రికులైన వ్యాపారి, కుటుంబ సభ్యులు లెఫ్టరైట్ తీసుకోగా సార్..సార్ అంటూ యూటర్న్ తీసుకున్నాడు. ఉదాహరణగా చెప్పటానికి ఇది ఒక ఘటన కాగా ఇలాంటివి కోకొల్లలుగా ఉన్నాయి. ఇలా కార్యాలయానికి వచ్చిన వారితో ఏదో ఒకల తన నోటి దూలతో చిర్రెత్తుకు వచ్చేలా వ్యవహరించడం పనిగా మార్చుకున్నాడు. ఇలా దురుసు ప్రవర్తనతో సాగిస్తున్న పోకడలు అన్ని ఇన్ని కావానే చెప్పాలి. పలుకుబడి ఉన్న వారు నోటి దూలపై గట్టిగా మందలిస్తే మిన్నకుంటూ.. సామాన్యులనైతే తీవ్ర ఇబ్బందులకు గురి చేసి ఫైల్స్ కదలనివ్వరనే టాక్ ఉంది. ప్రజల పన్నులతో జీతం తీసుకుంటూ వారిపైనే నోటి దూల ప్రదర్శిస్తూ ఇలా వ్యవహరించడం ఆయనకే చెల్లింది. ప్రజా పాలన ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న జిల్లా మంత్రులు, కలెక్టర్‌కు తన తీరుతో అపవాదును తీసుకువస్తున్నాడు. సదరు సార్ తీరుపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలోకి చేరడంతో అటు నుంచి పద్ధతి మార్చుకోవాలని అక్షింతలు పడ్డటు తెలిసింది. అయనప్పటికి అంతకంతకు దురుసు దర్పాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ వ్యవహారంపై అడ్డు కట్ట వేయకపోతే ఆగడాలు ఆగేలా? కనిచిండం లేదు.

**సెలవుల్లో ఆంతర్యం అదేనా..?**

సదరు నోటి దూల అధికారి విధుల్లో చేరిన నాటి నుంచి తరుచూ సెలవులు పెట్టడం పరిపాటిగా మారింది. తను చేస్తున్న చీకటి వ్యహారాలపై నిఘా వ్యవస్థలు దాడి నుంచి తప్పించుకునేందుకే అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనకు వత్తాసు పలికే కొందరు అసమాన్యుల ద్వారా ముందుగానే విషయం తెలుసుకొని, సెలవలతో జాగ్రత్త పడుతున్నారనే గుసగులు ఉన్నాయి. ఈ మధ్యకాలంలో సదరు అధికారి చీకటి భాగోతాలపై దాడులు జరుగుతాయని తెలిసి ముందస్తుగా సెలవులు తీసుకున్నట్లు ఆయన సన్నిహితుల ద్వారా తెలిసింది. అంతేకాకుండా తరచు తీసుకుంటున్న సెలవులు అధికారికమో?అనధికారికమో? అనే ప్రశ్న సైతం తోటి ఉద్యోగుల నోటి నుంచి వినపడుతుంది. తాజాగా తను నిర్వహిస్తున్న తాత్కాలిక విధుల్లో కొంతకాలం కొనసాగేల రవాణాశాఖలో పై స్తాయి నుంచి మంచి చెడు చూసుకొని హామీ తెచ్చుకున్నట్లుగా వినికిడి. ఇలా వ్యవస్థలో చేస్తున్న మేనేజ్‌మెంట్ తీరితో ఆడిందే ఆట పాడిందే పాటగా విధులు నిర్వహిస్తూ వివిదాస్పద విధులు నిర్వహిస్తున్నాడు. ఈ పోకడలపై విసిగి వేసారిన వారు నిఘా వర్గాలకు సాక్షాలతో సహా ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

# ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

(మొదటిపేజీ తరువాయి)

మధ్య భారత దేశంలో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న నర మేధాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఖమ్మం జెడ్పి సెంటర్‌లో మానవ హారాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వివిధ రాజకీయ పక్షాల నేతలు, ప్రజా సంఘాల బాధ్యులు మాట్లాడుతూ అడవిలో ఉన్నటువంటి ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ, కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారులు ముఖ్యంగా అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు మాత్ర మే కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్‌ను ప్రారంభించిందని ఆరోపించారు. పారా మిలటరీ దళాలు, గ్రేహౌండ్స్ దళాలు, సిఆర్‌పిఎఫ్, బస్తార్ ఫైటర్స్ ఇలా అన్ని రకాల సైనిక బలగాలు మావోయిస్టుల మాటున ఆదివాసీలపై దాడులు చేస్తున్నారన్నారు. పాకిస్తాన్ లేదా బంగ్లాదేశ్ సరిహద్దుల్లో మోహరించిన బలగాలను భారతదేశ పౌరులపైన మోహరిస్తూ ప్రాణాలను హరించడం సరి కాదన్నారు. మావోయిస్టులను తుదముట్టించడమే లక్ష్యమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మాట్లాడటం అప్రజాస్వామికమని బతికే స్వేచ్ఛను హరించడమేనన్నారు. నరమేధాన్ని కొనసాగిస్తున్న కేంద్ర బలగాలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఇప్పటికే పలు మార్లు మావోయిస్టులు శాంతి చర్చలకు సంబంధించి లేఖ విడుదల చేశారని నాయకులు తెలిపారు. తక్షణం శాంతి చర్చలకు కేంద్రం సుముఖత ప్రకటిస్తూ కగార్‌ను నిలిపివేయాలని కోరారు. దేశ సంపదను కొందరికి కట్టబెట్టేందుకు మాత్రమే ఆపరేషన్ కగార్ జరుగుతుందని దీనికి కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కాకి భాస్కర్, రవి మారుత్ సమన్వయ కర్తలుగా వ్యవహరించగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధు, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, ఎన్డి కార్యదర్శి రాజేంద్రప్రసాద్, పీపుల్స్ జేఏసి కన్వీనర్ దేవిరెడ్డి విజయ్, జర్నలిస్టు యూనియన్ జిల్లా కార్యదర్శి చిర్రా రవి, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ యాలమంచిలి రవీంద్రనాథ్, గోపగాని శంకర్‌రావు, స్వర్ణ సుబ్బారావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, పగడాల నాగరాజు, కిషన్ నాయక్, యర్లముడి కృష్ణయ్య, విప్లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఉప ముఖ్యమంత్రి భట్టి పర్యటన

ప్రజాపక్షం/ఖమ్మం : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క రెండు రోజుల పాటు ఖమ్మంజిల్లాలో పర్యటించనున్నారు. మూడవ తేదీ ముదిగొండ మండలం పమ్మి చేరుకుని అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. వల్లభి, బాణాపురం గ్రామాల్లోనూ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం తర్వాత ముత్తారం, చిరుమర్రి గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాలకు శంకుస్థాపన చేస్తారు. చిరుమర్రిలో అంగన్‌వాడీ కేంద్ర భవనానికి శంకుస్థాపన చేసిన అనంతరం పలు గ్రామాల్లో ఎన్‌ఆర్‌జిఎస్ క్రింద చేపట్టే పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు మధిర చేరుకుని అధికారులు, అనాధికారులతో సమావేశమవుతారు. నాల్గవ తేదీ ఉదయం 8.30 గంటలకు బయలుదేరి హైదరాబాద్ చేరుకుంటారు.

**మంత్రి తుమ్మల పర్యటన...**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేడు ఖమ్మం నగరంలో పర్యటించనున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు 44వ డివిజన్ రైతు మార్కెట్ నందు షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 9.30 గంటలకు ఏడవ డివిజన్ సైడ్ డ్రైన్ నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు. నాల్గున ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు పాల్వంచలో విజయ నర్సింగ్ హోమ్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు కొత్తగూడెంలోని ఎన్‌కె నగర్‌లో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 10.30 గంటలకు కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో చేకూరి కాశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

# ధాన్యం తరుగు లేకుండా దిగుమతి చేసుకోవాలి

ప్రజాపక్షం/చింతకాని : కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం ఎలాంటి తరుగు లేకుండా మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని చింతకాని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు పేర్కొన్నారు. శుక్రవారం చింతకాని తహసీల్దార్ కార్యాలయంలో చింతకాని, నాగులవంచ సహకార సంఘ సిఈవోలు, ఐకేపీ అధికారులు, మిల్లర్లతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని నేరడ, మత్కేపల్లిలో ఉన్న మిల్లులకు కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని దిగుమతి చేయాలని, ఎలాంటి తరుగు లేకుండా మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని సూచించారు. కేంద్రం నిర్వహకులు ధాన్యాన్ని సరైన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు చేయాలని రైతులను ఎలింటి ఇబ్బందులకు గురిచేయవద్దని ఆదేశించారు. ఈ సమావేశంలో చింతకాని, నాగులవంచ సహకార సంఘం సిఈవోలు మారగాని శ్రీనివాసరావు, యాలముడి శ్రీనివాసరావు ,ఐకేపి ఏపిఎం బొమ్మా శ్రీనివాసరావు, సీసీ అనురాధ, కొదుమూరు సెంటర్ ఇంచార్జ్ నాగమణి, మిల్లర్లు షేక్ రఫీ, చెవుల ఖాధర్‌బాబు , గిర్ధావర్ 1 సోయం రఘు పాల్గొన్నారు.

# భూగర్భ డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలి



## -కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఖమ్మం మురుగునీటి పైపులైన్ భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో రూ. 249.5 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులను అమృత్ 2 పథకం క్రింద మంజూరు చేసుకోవడం జరిగిందన్నారు. వీటిలో రూ. 189.50 కోట్లు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, రూ. 60 కోట్లు రాబోయే పదేళ్ల వాటి నిర్వహణకు కేటాయించడం జరిగిందన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంలో డ్రైనేజీలైన్ 8.5 కిలో మీటర్లకు గాను 1.54 కిలో మీటర్లు, 432 మ్యాన్ హోల్స్ నిర్మాణానికి గాను 73 మ్యాన్‌హోల్స్ నిర్మాణం పూర్తి చేశారన్నారు. ధంసలాపురం చెరువు వద్ద 44 ఎంఎల్‌డి సామర్థ్యంతో, పుట్టకోట చెరువు వద్ద 9.5 ఎంఎల్‌డి సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. టౌన్‌ప్లానింగ్, నీటిపారుదల శాఖాధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన పరీక్షలు పూర్తి చేసి మురుగు నీటి కాలువల నిర్మాణం అడ్డుగా ఉన్న ఆక్రమ నిర్మాణాల తొలగింపుకు కార్యచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనులు వేగవంతం కాకపోతే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డిఈ, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

# ఎబిఎపి ఆధ్వర్యంలో అన్నదానానికి ఏర్పాట్లు




## -అయ్యప్పస్వాములకు వసతి సౌకర్యాల కల్పన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** శబరిమలలో అయ్యప్ప స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించుటకు తీర్మానించినట్లు ఎబిఎపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా|| టివి పుల్లంరాజు తెలిపారు. అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కార్యవర్గ సమావేశం శుక్రవారం కేరళ రాష్ట్రం అలువ పట్టణంలో జాతీయ అధ్యక్షులు కె. అయ్యప్పదాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో 2025 26 సంవత్సరానికి సంబంధించి సంస్థ చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించినట్లు డా|| పుల్లంరాజు తెలిపారు. ప్రతి నెల శబరిమలలో అయ్యప్పస్వామి ఆలయం తెరిచిన రోజు నుంచి దేవాలయం మూసివేసే రోజు వరకు ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించుటకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ఆయన తెలిపారు. ఇందుకు కావాల్సిన వస్తువుల సమీకరణకు కార్యచరణ చేసినట్లు తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఎరుమెలి నుండి పంబ వెళ్లే మార్గ మధ్యలో నారాయణ తోడ్ వద్ద నిర్మించిన అన్నదాన మందిరంపై మొదటి అంతస్తులో డోనర్స్ రూములు, రెండవ అంతస్తులో భక్తులు సేద తీరుటకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయుటకు సభ్యులు ఆమోదించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి నిధుల సమీకరణకు ప్రణాళికలు చేసినట్లు పుల్లంరాజు తెలిపారు. శబరిమలలో మండల పూజలు ప్రారంభించే నాటికి అన్నదాన మందిర ప్రాంగణంలో 18 అడుగుల అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్టను శబరిమల మేల్ శాంతి సమాజం అధ్యక్షులు తీరు ఎజికోడే శశి నంబూత్రి, కార్యదర్శి తిరు శ్రీ రెజీకుమార్ నంబూత్రి, కోశాధికారి తిరు శ్రీదామోదరన్ పొట్టిలతో శంకుస్థాపన చేయించుటకు తీర్మానించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ నుంచి ఎబిఎపి ట్రస్టు శాశ్వత సభ్యులు రాచర్ల రమేష్, రాష్ట్ర కోశాధికారి పోతురాజుల రమేష్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

# రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం






**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** కేంద్ర ప్రభుత్వం జాతీయ కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ రాహుల్ గాంధీ ఆలోచన విధానాన్ని అమలుపర్చడం కాంగ్రెస్ విజయంగా భావించి శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాహుల్ గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆనాడు భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక జాతీయ కులగణన కార్యక్రమాన్ని చేపడతామని రాహుల్ గాంధీ ఏదైతే మాట చెప్పారో దానిని బిజెపి ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు కావడం సాధ్యం కాదని చెప్పిందన్నారు. రాహుల్ గాంధీ మాత్రం జనగణన, కులగణన జరగాల్సిందేనని చెప్పారన్నారు. ఆనాడు రాహుల్ గాంధీ చెప్పిన అంశాన్ని రోల్ మోడల్‌గా తీసుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ జనగణన, కుల గణన చేపట్టినందుకు గర్వపడుతున్నామన్నారు. దేశ ప్రజలకు ఏది అవసరమో అది చేయడం కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. ఈ విజయాన్ని వారిదని చెప్పుకోవడానికి బిజెపి సతమతమవుతుందన్నారు. రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకు కులగణన చేపట్టాల్సి వచ్చినందున రాహుల్ గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిసిసి అబ్జర్వర్ నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు బత్తిన శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, నాగండ్ల దీపక్ చౌదరి, కె. సీతారాములు, మొక్కా శేఖర్‌గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, బాలగంగాధర్ తిలక్, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్ళ అరెస్టు



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండలంలోని వంగవీడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఇద్దరిని మధిర రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమచారం రావడంతో రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి తన సిబ్బంది ధర్మ,శంకర్, తిరుపతితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుండి ఒక బైక్, రూ.1200 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. మరో ఇద్దరు తప్పించుకునిపోయారని, వారిని కూడా పట్టుకుంటామని, పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై లక్ష్మీ భార్గవి హెచ్చరించారు.

# తలారి రాములుకు శ్రమశక్తి అవార్డు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల కేంద్రం కొణిజర్ల గ్రామానికి చెందిన తలారి రాములు ఐఎన్‌టియుసి మిషన్ భగీరథ విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కార్యదర్శి. మేడే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి లో నిర్వహించిన వేడుక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక శ్రమశక్తి అవార్డును తలారి రాములుకు రాష్ట్ర ప్రభుత్వ కార్మికశాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ ఎం దానకిషోర్ చేతులమీదుగా అవార్డును అందుకున్నాడు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక అవార్డుకు తలారి రాములు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ సొసైటి వైస్ చైర్మన్ నెల్లూరి రమేష్, ప్రయివేటు స్కూల్స్ అసోషియేషన్ ఖమ్మం జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొణతం ఉమాశంకర్, మల్లుపల్లి మాజీ సర్పంచ్ రేపాల వెంకన్న పాల్గొని అభినందించారు.

# శ్రీ చైతన్య అధ్యాపకురాలికి డాక్టరేట్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్లు పంచాయతీ పరిధిలో గల శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళా శాల ఎంబీఏ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేశ్వరి కి డాక్టరేట్ లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కుప్పంలోని ద్రవిడయన్ యూని వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైనల్ వైవలో తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమ ర్పించిన సిద్ధాంతం పత్రంకు గాను కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య కళాశాల ఆధ్వరయలో అధ్యాపకులు శాలువలతో సత్కరించారు. అలాగే కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సాయిగీతిక, ప్రిన్సిపాల్ డాక్టర్ మురళి కృష్ణ ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ అకాడమిక్స్ డాక్టర్ సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జ్ కృష్ణప్రసాద్, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ వైశాలి, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ హరిప్రసాద్, శ్రీకుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# వడదెబ్బతో ఆరెంపుల వాసి మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెంపుల గ్రామానికి చెందిన దోరెపల్లి శ్రీను(55) వడదెబ్బతో శుక్రవారం మృతి చెందాడు. పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా ఇంటివద్దే అస్వస్థతకు గురయ్యాడు.ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు గురువారం హాస్పిటల్‌కు తీసుకువెళ్లినప్పటికీ లాభం లేకుండా పోయింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఉపాధిహామీ ఉద్యోగుల నిరసన



**ప్రజాపక్షం/ మధిర :** పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం మధిర మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించటం లేదన్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ భారం కావడంతో రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు ఖమ్మం జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆవుల సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పెన్ డౌన్ చేయగా భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలను మంజూరు చేయాలని, ఉద్యోగులకు పే స్కేల్ త్వరగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు బొల్లెద్దు విజయ్‌కుమార్, రేలచర్ల అనీల్‌కుమార్, వేల్పుల ముత్తయ్య, గుజ్జర్లపూడి శాంతయ్య, సుగ్గల గిరీష్, అదరం సుజాత తదితరులు పాల్గొన్నారు.

# మధిర మార్కెట్ యాడ్ ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మార్కెట్ యాడ్ ఆదాయం పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు సూచించారు. శుక్రవారం మధిర వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయం నందు మార్కెట్ సెక్రటరీ చంద్రశేఖర్‌తో కలిసి మార్కెట్ కమిటీ 202425 ఆర్థిక సంవత్సరం ముగిసిన సందర్భంగా సంబంధిత ఆదాయ వ్యయాలు తదితర వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జరిగిపోయిన సంవత్సరం కన్నా వచ్చే ఆర్థిక సంవత్సరం అధిక ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మార్కెట్ సెక్రటరీ చంద్రశేఖర్‌కు తెలిపారు.

## గ్రామపంచాయతీ కార్యాలయం ముట్టడి




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని గుండెపుడి గ్రామ పంచాయతీలో అర్హులకు ఇందిరమ్మ గృహాలు ఎంపికలో తీవ్ర అన్యాయం జరిగిందని శుక్రవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ గృహాలకు అప్లై చేసుకున్న ప్రజలు భారీ సంఖ్యలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ ముట్టడి కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కొండపల్లి శ్రీధర్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు ఇవ్వకుండా అనర్హులకు ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి యాస నరేష్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి బానోతు ధర్మ, టిఆర్ఎస్ మండల నాయకులు సీతాకుమారి, సిపిఎం నాయకులు వి చందర్ రావు, బానోత్ మధు, గార్లపాటి వెంకట, పద్దం సుగుణ, కనక రత్నం, ఇల్లంగి సీతారాములు, రామచంద్రపురం శాఖ కార్యదర్శి నరసింహ రావు, భూక్యా సురేష్, గ్రామ పంచాయతీలోని అధిక సంఖ్యలో ప్రజలు, గ్రామపంచాయతీ యువకులు పాల్గొన్నారు.

## జూలూరుపాడు ప్రెస్ క్లబ్ (సీనియర్స్) నూతన అధ్యక్షునిగా చంద్రశేఖర్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రెస్ క్లబ్ (సీనియర్స్) కమిటీ నూతన అధ్యక్షునిగా సీనియర్ జర్నలిస్ట్ కొలిపాక చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఉన్న తాత్కాలిక కమిటీని రద్దు చేసుకొని కొత్త కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చాపలమడుగు నరసింహారావు అధ్యక్షతన గురువారం ఎన్నిక నిర్వహించారు. కమిటీ అధ్యక్షుని ఎన్నికతో పాటు ప్రెస్ క్లబ్ సంయుక్త కార్యదర్శిగా నల్లగట్ల దిలీప్ కుమార్ ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు తంబర్ల పుల్లారావు, సహాయ కార్యదర్శి ఉసికల రమేష్, కోశాధికారి షేక్ బుడెన్ పాషా, గౌరవ అధ్యక్షులు సబ్బతి శివమూర్తి, గౌరవ సలహాదారులు పెండ్యాల విజయభాస్కర్, బండి సత్యనారాయణ, అన్నవరపు జశ్వంత్, కాసిమల్ల సురేష్, గోగుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ప్రతిభకు పట్టాభిషేకం




**ప్రజాపక్షం/కరకగూడెం:** ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో పినపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సర ఎంపీసీ విభాగంలో లింగంపల్లి వర్షిత్ 433/470 మార్కులు సాధించిన సందర్భంగా వర్షిత్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో సైతం విద్యార్థులు కార్పొరేట్‌కు ధీటుగా మార్కులు సాధిస్తున్నారన్నారు. విద్యార్థులకు ప్రభుత్వపరంగా అనేక సదుపాయాలు కల్పిస్తూ, పోటీ పరీక్షలకు కూడా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నామన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం కె.సుదర్శన్, శ్రీదేవి, యం రమేష్ బాబు, స్వప్న, ప్రణీత, పేరెంట్స్ ఎల్. దయానంద్, శరత్ చంద్ర పాల్గొన్నారు.

## జెఎసి సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ మధిర :** మధిర డిపో జెఎసీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుండి జరిగే సమ్మె సన్నాహక పోస్టర్లను ఖమ్మం రీజియన్ జెఎసి చైర్మన్ పిల్లి రమేష్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమ్మెకు జె ఎసీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తిమ్మినేని రామారావు, ఉపాధ్యక్షురాలు కె.అరుణకుమారి, సహాయ కార్యదర్శి రామచంద్రరావు, రీజియన్ నాయకులు లాజర్, మధిర డిపో అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పులి కనకదుర్గయ్యకు ఎంపి రఘురామిరెడ్డి నివాళి



**ప్రజాపక్షం/ తల్లాడ :** ప్రజాపక్షం వైరా రిపోర్టర్ పులి కృష్ణార్జున్‌రావు తండ్రి పులి కనకదుర్గయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. శుక్రవారం తన స్వగ్రామం తల్లాడ మండలం రామచంద్రపురంకు ఖమ్మం ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి వెళ్లి పులి కనకదుర్గయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గప్రసాద్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలులో ఘరానా మోసం..!

**-ఐదు కేజీల కోతపడుతున్న వైనం**
**-మిల్లర్లే సూత్రధారులుగా ధాన్యం కొనుగోలు**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండల రైస్ మిల్లర్ల ఆగడాలు శృతిమించుతున్నాయి. రైతులు ధాన్యం కొనుగోళ్ళలో అడుగడుగునా దోపిడికి గురవుతున్నారు. ప్రభుత్వమే ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొంటున్నా దోపిడీ మాత్రమే కొనసాగుతూనే ఉన్నది. కొనుగోలు కేంద్రం నుంచి రైస్ మిల్లులకు చేరే వరకు దోపిడీ చేస్తున్నారు. చివరకు రైస్ మిల్లులకు చేరిన ధాన్యంలోనూ భారీగా కోతలు విధించి రైతులను నట్టేటా ముంచుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి దోపిడీ చేయడంతో రైతులు లక్షల్లో నష్టపోతున్నారు.

### వివరాల్లోకి వెళితే..

జిల్లా వ్యాప్తంగా యాసంగి పంట వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఐకేపీ, పీఏసీఎస్, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ధాన్యంలో తాలూ లేకుండా తుర్పార బట్టి తూకం వేసి రైస్ మిల్లులకు వేసిన తరువాత పంపించారు. ధాన్యంలోనూ రైస్ మిల్లర్లు బస్తాకు 2 కిలోల చొప్పున.. క్వింటాలుకు ఐదు కిలోల వరకు కోత విధించారు. కొనుగోలు కేంద్రం నుంచి పంపించిన తూకం ట్రక్ షీట్లలో కోతలను తగ్గిస్తూ రైతులకు పంపిస్తున్నారు. తూకం వేసిన రోజునే కాకుండా ఆలస్యంగా పంపిస్తుండటంతో కొందరు రైతులు గుర్తించలేకపోయారు. మరి కొందరు రైతులు గుర్తించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్వింటా ధాన్యం కొనుగోలులో 5 కిలోల కోత విధించడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇలా కోతల పేరుతో జిల్లాలో రైస్ మిల్లర్లు భారీగా దోపిడీకి పాల్పడుతున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంలో క్వింటాకు 5 కిలోల కోత విధించడంతో మండలంలో రైస్ మిల్లర్లు కొనుగోలు చేసిన వేలాది మెట్రిక్ టన్నుల్లో కోట్లల్లో దోపిడీ జరిగింది.

### మిల్లర్లపై దాడులు నిల్...

ఇదిలా ఉండగా.. కొనుగోలులో సైతం రైతును దోపిడీ చేశారు. నిజానికి తూకంలో 40 కిలోల బస్తాకు సంచి బరువుగా 650 గ్రాములు అదనంగా తూకం వేయాల్సి ఉంటుంది. కానీ కొనుగోలు కేంద్రాల్లో అదనంగా మరో 100 గ్రాముల వరకు ఎక్కువగా తూకం వేశారు. హమాలీకి కూలీగా క్వింటాలుకు రూ.25 నిర్ణయించగా, రూ.35 నుంచి రూ.37.50 వరకు వసూలు చేశారు. అదనంగా హమాలిలో క్వింటాలు రూ.10 నుంచి 12.50 వరకు వసూళ్లు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ప్రభుత్వమే రవాణా ఖర్చులను భరించాల్సి ఉంటుంది. అయితే లారీల యజమానులు రైతుల వద్ద నుంచి బస్తాకు రూ. 2 నుంచి రూ.10 వరకు (క్వింటాలు రూ.5 నుంచి 25 వరకు) రైతుల నుంచి వసూళ్లు చేశారు. తూకంలోనూ.. హమాలీ ఛార్జీల్లోనూ.. ట్రాన్స్ పోర్టులోనూ.. రైతులు ఇలా దోపిడీకి గురయ్యారు. ఇవన్నీ జరిగినా రైతులు ధాన్యం కొనుగోలు చేయాలన్న మిన్నకుండిపోయారు. చివరగా రైస్‌మిల్లులకు చేరిన ధాన్యంలోనూ మిల్లర్లు కోతల పేరుతో భారీ దోపిడీకి పాల్పడడంతో ట్రక్ షీట్ వచ్చాక అసలు మోసం తెలిసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రం నుంచి వసూళ్లను తట్టుకుంటే చివరికి మిల్లులకు చేరాక అదే దోపిడీతో గొల్లుమంటున్నారు.

### క్వింటా ధాన్యం ఆడితే 5 కిలోలు మాయం..?

మండలంలో రైసు మిల్లర్లు మధ్య వర్తులుగా కొందరు అధికారులు వారి పేరుతో వందలు, వేల లక్షల దోపిడీకి తెరలేపారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మిల్లుల్లో ఒక క్వింటాల్ ధాన్యం ఆడిస్తే, బాయిల్డ్ రైస్ అయితే 70 కిలోలు బియ్యం వస్తాయి. కానీ మిల్లర్లు 65 కిలోలే రికార్డుల్లో చూపించి 5 కిలోలు మాయం చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రైస్ లో సాధారణం రకం అయితే క్వింటాల్ కు 65 కిలోలు బియ్యం వస్తాయి, ఫైన్ క్వాలిటీ ధాన్యం ఆడిస్తే 67 కిలోల బియ్యం వస్తాయి. ఇక్కడా రైతులకు నిండా మోసం జరుగుతుంది.. మిల్లర్లు రైతులకు, రికార్డుల్లో 60 కిలోలు బియ్యం వచ్చినట్లు చూపించి మిగతావి మాయం చేస్తున్నారని రైతులు వాపోయారు. మోసం, దగాలకు కేరాఫ్ ఐకేపీ కేంద్రాలు? ఇక ధాన్యం కొనుగోలు కోసం ప్రభుత్వం పెట్టిన ఐకేపీ కేంద్రాలు రైతుల శ్రమను ఆసాంతం దోచేస్తున్నాయన విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఆరుగాలం కష్టపడ్డ రైతుకు ఎంత పంట పండినా చేసిన అప్పులకు తప్ప చేతిలో చిల్లిగవ్వ మిగలడం లేదు. ఐకేపీ కేంద్రాల్లో కొంటున్న ధాన్యంలో బస్తాకు 5 కిలోలు తేమపేరుతో, మట్టిపేరుతో 2కిలోలు, తాలు పేరుతో 2 కిలోలు, గోనెసంచి పేరుతో కిలో మాయం తీసేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అంటే మొత్తం బస్తాకు 10 కిలోలు తరుగు చూపిస్తున్నారన్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నిజానికి ఈ తరుగు మిల్లర్లకు మిగులుగా ఉంటోంది. ఇలా తరుగు పేరుతో కొట్టేసిన ధాన్యంలో అధికారులకు, స్థానిక నేతలకు వాటాల రూపంలో చెల్లిస్తున్నట్లు ఆఫ్ ద రికార్డుగా మిల్లర్లే వాపోతున్నారు.

### విసిగిన రైతుకు దళారుల అండ.. దందా...

ధాన్యం ఏ రైస్ మిల్లుకు వెళ్లాలని నిర్ణయించే ట్యాగింగ్ నెల తర్వాత గానీ ఇవ్వలేదు. పాలకులు ఎప్పుడో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని గంభీర ప్రకటనలు చేసినా, నెల రోజులపాటు కొనుగోళ్లే జరగలేదు. ప్రతి చివరి గింజనూ కొంటామనే మాటలకు విలువ ఉందా? విసిగి వేసారిన రైతులు అనేక జిల్లాల్లో గిట్టుబాటు ధర వదిలేసి అయిన కాడికి ప్రైవేట్ మార్కెట్ కు అమ్ముకుంటున్నారు. కారు చౌకగా క్వింటాకు రూ.1700 అమ్ముకున్నారు. ఒక క్వింటాకు రైతు రూ. 460 నష్టపోయారు. రైతులను తప్పుపట్టడానికి వీలేలేదు. నష్టపోయిన రైతులకు మద్దతుధర చెల్లించాలి. ప్రభుత్వం మిల్లర్లు కుమ్మక్కై కొనుగోళ్లు నిలిపివేస్తే రైతులు కారుచౌకగా అమ్ముతారనే భావన బలంగా వుంది. ఇన్ని ఘోరాలు జరుగుతుంటే, తెలంగాణ రైతులను గాలికొదిలి, ఈ రైతులు అన్ని బాధల నుంచి విముక్తి అయినట్లు, మిల్లర్లు అనేక సాకులతో వడ్లను వేగంగా దించుకోవడంలేదు. లారీలు సకాలంలో రావడం లేదు. లారీలు పంపాలని, వేగంగా దించుకోవాలని, దోపిడీని ఆపాలని రోజూ రైతులు రోడ్డెక్కుతూనే వున్నారు. రైతు రుణంలో ప్రీమియం కట్ అవుతున్నా, కంపెనీలు రైతులకు బీమా ఇవ్వవు. ప్రభుత్వానికి పట్టదు. నష్టపోయిన ప్రతిరైతును ఆదుకునే సమగ్రబీమా పథకం కావాలని, రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**-జెడ్పిసిఈవోను కలిసిన పిఆర్‌టియు నేతలు**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని జెడ్పిసిఈవో దీక్షారైనాను పిఆర్‌టియు టిఎస్ ఖమ్మంజిల్లా నేతలు కోరారు. శుక్రవారం పిఆర్‌టియు టిఎస్ ఖమ్మంజిల్లా శాఖ అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాయకులు ఖమ్మం జెడ్పి సిఈవో దీక్షారైనాను కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. జెడ్పి జిపిఎఫ్ ఖాతాలలో 2022 మార్చి నుంచి ఇంట్రెస్ట్ క్రెడిట్ కాకపోవడం, గత మూడేళ్లుగా ఖాతాల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, ఉద్యోగ విరమణ పొందిన, క్యాడర్ మారిన ఉపాధ్యాయుల జిపిఎఫ్ ఖాతాల్లో నిల్వలను బదిలీ చేసేటప్పుడు దానికి వడ్డీ జత చేయకపోవడంతో ఉద్యోగ విరమణ సమయంలో నష్టపోతున్న విషయాన్ని జెడ్పిసిఈవో దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సిఈవో ఖాతా బదిలీ చేసేటప్పుడు వడ్డీ మొత్తాన్ని మ్యాన్యువల్‌గా లెక్కించి ఆ మొత్తాన్ని స్టేట్‌మెంట్ రూపంలో ఇతర జిల్లాల జెడ్పిలకు తెలియజేయడం జరుగుతుందని అందుకు అవసరమైనచర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్ట్ ఫైనల్, లోన్ల చెక్కులు ఏళ్ల తరబడి జమ కావడం లేదని పిఆర్‌టియు నేతలు సిఈవో దృష్టికి తీసుకు వచ్చారు. ఇది రాష్ట్ర వ్యాప్త సమస్య అని రాష్ట్ర అధికారులతో చర్చిస్తామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు త్వరగా పరిష్కారమయ్యేలా చేస్తామని తెలిపిన జెడ్పిసిఈవోకు పిఆర్‌టియు టిఎస్ ఖమ్మం జిల్లా శాఖ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్టా శేఖర్‌రావు, తాళ్లూరి చంద్రశేఖర్‌రావు, రత్నకుమార్, లింగం సతీష్, డిప్యూటీ సిఈవో నాగపద్మజ, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అమృతధార.. మట్టికుండ..!

**-సహజ సిద్ధమైన నీటిని అందించే మట్టి కుండ**
**-నేటికీ తగ్గని డిమాండ్**
**-వేసవి వచ్చిందంటే ప్రతి ఇంట్లో ఉండాల్సిందే**
**-దాహార్తి తీరాలంటే మట్టికుండ నీరు తాగాల్సిందే**
**-పేదోడి ఫ్రిడ్జ్‌గా ఖ్యాతి**







**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** వేసవి వచ్చిందంటే చాలు ప్రతి ఇంట్లో మట్టికుండ ఉండాల్సిందే. పల్లె నుండి నగరం, మహానగరం ఏదైనా కావచ్చు వంటింట్లో మట్టి కుండకు ప్రత్యేక స్థానం ఉంటుంది. సహజ సిద్ధంగా నీటిని చల్లబరిచే గుణం మట్టి కుండది. మట్టి కుండ, రంజన్ తయారీ కోసం కుమ్మరులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. మట్టి కుండ లో ఉన్న అతి సూక్ష్మ రంధ్రాల ద్వారా గాలి కుండలోకి దూరి కుండలోని నీరు సహజ సిద్ధంగా, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చల్లబరుస్తుంది. అంతేగాక అందులోని నీరు సహజ సిద్ధంగా, 100 శాతం ప్యూరీపైయిర్‌గా మారుతుంది. ఫలితంగా ఆరోగ్యంతో పాటు వేసవిలో దాహార్తి తీరుస్తుంది. మట్టి కుండలోని నీటిని సేవిస్తే, దాహం ఇట్టే తీరిపోవడం మట్టి కుండ స్పెషాలిటీ. అందుకే మట్టి కుండను అధునీక యుగంలో అమృతధారగా పిలుచుకుంటారు.

### ఇమ్యూనిటీ గుణాలు అధికం...

మట్టి కుండలోని నీటిని తాగడం వల్ల నేలలోని సహజ మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ కోల్పోకుండా మట్టి కుండ కాపాడుతుంది. స్వచ్ఛమైన నీరు శరీరానికి అందడం కారణంగా శరీరం డిహైడ్రేడ్ కాకుండా శక్తి పెంపొందించబడుతుంది. మట్టి కుండలోని నీటిలో ఇమ్యూనిటీ గుణాలు అధికంగా ఉంటాయి. ఆ నీరు తాగడం వల్ల అలసట కూడా దరిచేరదు.

### ఆల్కాలైన్ నేచర్...

ఎసిడిటి పరిస్థితుల్లో వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. ఆల్కాలైన్ కంటే మరింత ఎక్కువగా శరీరం ఎసిడిటికి గురవుతుంది. దీనితో ఆరోగ్యం ప్రమాదకర స్థితికి చేరుకుంటుంది. మట్టితో తయారు చేసిన కుండలోని నీటిని తాగడం వల్ల నేచ్యురల్‌గా ఆల్కాలైన్ పొందుతారు. దీనికి ముఖ్య కారణం మట్టిలోని ఖనిజ లవణాలకు తోడు మట్టి కుండ నుండి నిత్యం ఆక్సిజన్ కుండలోకి ప్రసరించడం కారణంగా ఖనిజ లవణాలకు ఆక్సిజన్ తోడై వాటికి జీవం మరింతగా పెరుగుతుంది. ఫలితంగా కుండలోని నీటిని తీసుకుంటే శరీరానికి ఉపయోగపడే మంచి ఆల్కాలైన్ నీరుగా రూపాంతరం చెంది మనకు అందుతుంది. ఇక ఇందులో హానికర కెమికల్స్ ఉండవు కాబట్టి సన్ స్ట్రోక్ నుండి తప్పించుకోవచ్చు. దగ్గు, జలుబు, ఆస్తమాతో బాధపడే వారికి ఫ్రిడ్జ్ కంటే మట్టి కుండలోని నీరు శ్రేష్టమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. శీతోష్ణస్థితులకు అనుగుణంగా మట్టి కుండ దాని స్వభావం మారుతుంది. జీర్ణశక్తిని పెంచి కొవ్వును కూడా నియంత్రిస్తుంది. అందుకే మట్టి కుండలోని నీటిని అమృతధారగా పిలుస్తారు.

## అక్కరకు రాని ఆకు..!

**-తునికాకు సేకరణపై తగ్గిన ఆసక్తి**
**-మేలైన ఆకు కొరత, ఉపాధి పనులే కారణం**





**ప్రజాపక్షం/పినపాక:** ఏజెన్సీ ప్రాంతాల్లో ఒకప్పుడు ప్రధాన ఉపాధి వనరుగా ఉన్న తునికాకు నేడు అక్కరకు రాకుండా పోతోంది. మారిన పరిస్థితుల కనుగుణంగా తునికాకు సేకరణ వల్ల ఫలితం లభించకపోవడంతో ఆదివాసీలు ఆకు సేకరణకు ఆసక్తి చూపడం లేదు. ఒకప్పుడు తునికాకు సేకరణ అంటే అటవీ గ్రామాల్లో పండుగ వాతావరణం ఉండేది. ఆకు సేకరణ ఎప్పుడు ప్రారంభమవుతుందా...అని గిరిజనులు ఎదురుచూసేవారు. ఆకు కోయాలంటూ కలేదార్లు గ్రామాల్లో టమకా వేయించకముందే గిరిజనులు అడవుల్లోకి వెళ్లి ఆకు సేకరణ చేసే వారు. ప్రతి ఏడాది ఎండాకాలంలో ఆడ, మగ, పెద్ద, చిన్న తేడా లేకుండా ఆకు సేకరించి డబ్బు సంపాదించేవారు. బీడీ ఆకుల సేకరణకు గిరిజనులు తొలి కోడి కూతతో మేల్కొని వంటలు చేసుకుని, అంబలి, గంజి తీసుకుని అడవులకు పయనమవుతారు. అడవుల్లో చెట్టు చెట్టుకు తిరిగి బీడీ(తునికి) ఆకులను సేకరించి కట్టలు కట్టి ఇంటికి చేరుకుంటారు. ఆకులను కట్టలు కట్టేందుకు ముందస్తుగానే తాటిమట్టలను సేకరించి, నార తీసి అడవులకు తీసుకెళతారు. అడవుల్లో చెట్ల కింద సేద తీరుతూ బీడీ ఆకులను కట్టలు కట్టి, నేరుగా కల్లాల వద్దకు తీసుకొస్తారు. చాలా మందికి తునికాకు సేకరణ ఉపాధి మార్గంగా ఉండేది కానీ నేడు పరిస్థితులు మారాయి. ఏజెన్సీ మండలమైన పినపాకలో ఆకు సేకరణ అంటేనే గిరిజనులు ముం దుకు రావడం లేదు. అటవీ శాఖ స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యాన్ని పెట్టుకున్నా...ఆ లక్ష్యాన్ని చేరుకునే పరిస్థితి కనిపించడం లేదు. తునికాకు నగదును గిరిజనుల అకౌంట్లలో జమ చేస్తుండడమే వారు ఆకు సేకరణకు దూరమవ్వడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అందులో ప్రధానంగా ఆకులు కోసిన తర్వాత అధికారులు నగదును గిరిజనుల అకౌంట్లో వేస్తుండం ఇందుకు కారణం. చాలా మంది నగదు తమ అకౌంట్లో పడటం లేదని దీనిపై అధికారులను అడిగితే స్పందన ఉండటం లేదని వాపోతున్నారు. అలాగే ఆకు కోసేవారిలో చాలా మంది నిర్లక్ష్యరాసులు, వయసుపైబడిన వారు ఉం డటం గమనార్హం. అలాగే ఆదివాసి అడవుల్లో నాణ్యమైన ఆకు లభించకపోవడం మరో కారణంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చాలా గ్రామా ల్లో తునికాకు సేకరణ టార్గెట్‌ను చేరుకోవడం కష్టతరంగానే కనినిస్తోంది. ఆయా యూనిట్లలో తునికాకు కొమ్మ కొట్టె ప్రక్రియను ప్రారంభించలేదు. ఆకు సేకరణ ప్రక్రియను ప్రారంభించకపోవడంతో కూలీలు ఉపాధి కోసం అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో తునికాకు యూనిట్లు అమ్ముడుపోకపోవడంతో తునికాకు సేకరణ ఇం కా మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, కూలీలు ఉదయం వేళల్లో ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. దీంతో ఆకు సేకరణపై ఆయా గ్రామాల్లో తునికాకు సేకరణ కోసం కూలీలు ఆసక్తి చూపడం లేదు.

## పరిశ్రమల విద్యుత్ బ్రేకర్ ప్రారంభం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పెద్ద కోరుకొండి విద్యుత్ ఉపకేంద్రం లో శుక్రవారం రూ. ఎనిమిది లక్షల విలువచేసే పరిశ్రమల విద్యుత్ బ్రేకర్ ను డి ఈ రాములు శుక్రవారం ప్రారంభించారు. ఉపకేంద్రం పరిధిలోని ఉన్న పరిశ్రమలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా ఉపయోగపడుతుందని విద్యుత్ శాఖ అధికారి రామ్ రెడ్డి తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఉన్న పరిశ్రమలకు ఈ బ్రేకర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చిన్న కోరుకొండి,పెద్ద కోరుకొండి, చెన్నూరు, వెన్నవల్లి, తదితర గ్రామాలలో ఉన్న పరిశ్రమలకు నిరంతరం ఈ బ్రేకర్ ఉపయోగకారిగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి ఈ సతీష్, పెద్ద కోరుకొండి విద్యుత్ ఉపకేంద్రం సిబ్బంది హరీష్ తోపాటు ఏఏ ఎం, జేఎల్‌ఎం, ఆపరేటర్లు వినియోగదారులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓను అడ్డుకున్న గ్రామస్థులు



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని శుక్రవారం అన్నారుగూడెం గ్రామానికి వచ్చిన ఎంపిడిఓను గ్రామస్తులు అడ్డుకుని కారు ముందు బైఠాయించి తమ నిరసనను తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో 40ఇండ్లు మంజూరు కాగా అర్హులైన ఏ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని గ్రామస్తులు ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి, ప్రభుత్వ ఉద్యోగం ఉన్న వారికే ఇందిరమ్మ కమిటీ ప్రాధాన్యతనిచ్చి వారికి మొగ్గు చూపిందని, ఈ కమిటీ నిరుపేదలకు మొండిచెయ్యి చూపించిందని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/ తల్లాడ :** దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర క్యాబినెట్ తీసుకున్న జనగణన కుల గణన నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా బిజెపి తల్లాడ మండల అధ్యక్షులు చల్లా నాగులు ఆధ్వర్యంలో శుక్రవారం మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగే విధంగా కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రధాని నరేంద్రమోడీ పాలన కొనసాగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇవి రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గాదె కృష్ణారావు, మండల నాయకులు తేజవత్ బాలాజీనాయక్, రాయల రమేష్, గొల్లమందల నరేష్, సాయిచందు,చల్లా నరేష్, రాము, వేణు పాల్గొన్నారు.

## కాంగ్రెసోళ్లకే ఇండ్ల మంజూరుపై ఆందోళన

**-నిరుపేదలకు మొండిచేయి చూపడంపై ఆగ్రహం**




**ప్రజాపక్షం/చింతకాని :** ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెసోళ్లకు, గతంలో ఇందిరమ్మ ఇండ్లు అమ్ముకున్న వారికి తిరిగి ఇండ్లు మంజూరు చేశారని ఆరోపిస్తూ చింతకాని మండలం తిరుమలాపురం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బండి రామారావు, గోగుల నర్సింహారావు మాట్లాడుతూ గ్రామానికి మంజూరైన 12 ఇళ్లకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గతంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరై అమ్ముకున్న వారికి రహస్యంగా ఎంపిక చేశారని ఆరోపించారు. గ్రామంలో చాలా మంది నిరుపేదలు పూరి గుడిసెలు , రేకుల షెడ్లలో అద్దె ఇండ్లలో ఉంటూ అర్హులైనప్పటికీ ఇండ్లు ఎందుకు మంజూరు చేయలేదని పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేయానలి చూస్తే మనుగడ సాగించలేరని, ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇందిరమ్మ కమిటీలు కమిటీలు కాంగ్రెస్ కమిటీలుగా మారాయని , వెంటనే వాటిని రద్దు చేసి అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో గ్రామస్థులు చాపలమడుగు వీరబాబు, ప్రభాకర్ రావు, పిచ్చయ్య, శాంతి కుమార్, మధు, రమేష్, చింతల రామకృష్ణ, దీపిక, మేనకాగాంధీ, చామంతి, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వేతనాల కోసం నిరసన



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు ఎంపీడీవో కార్యాలయం ముందు ఉపాధి హామీ ఏపీవో అధికారి హేమమాలిని ఆధ్వర్యంలో ఉపాధి హామీ జేఈ పుల్లారావు టిఏలు శుక్రవారం నల్లరిబ్బలతో కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గత మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబాలు పోషణకు ఇబ్బందులు పడుతున్నట్లు దీంతో శుక్రవారం నుంచి నల్ల రిబ్బన్లతో నిరసన నిరసన కార్యక్రమాన్ని పాటిస్తూ విధుల్లో పాల్గొంటున్నామని వారు తెలిపారు. ప్రభుత్వాలు బడ్జెట్ విడుదల చేయకపోవడం వలన ఉపాధి హామీ అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల వేతనాలు అందక కుటుంబం పోషణ ఇబ్బందికరంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు మురళి, ముత్తయ్య, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు



**- 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు**
**- సిపి సునీల్‌దత్**

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : కమిషనరేట్ పరిధిలో ఈనెల 4వ తేదీ ఆదివారం నిర్వహించనున్న నీట్ (ఎన్ఈఈటి) ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 163 బిఎన్ఎస్ఎస్ (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాలకు రెండు వందల మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులు గుంపులుగా ఉండరాదని సూచించారు. అదేవిధంగా ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, డీజేలు, మైకులతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించడం నిషేధిస్తున్నట్లు తెలిపారు. పరీక్షకేంద్రాల సమీపంలోని ఇంటర్‌నెట్, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలన్నారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తచర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ వర్గాల ప్రజలు, సంఘాలు, పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరిక్ష కేంద్రాలైన ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, యూనివర్సిటి పిజి కళాశాల, ఎన్ఎస్‌పి క్యాంపులోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ మహిళ డిగ్రీకళాశాల, కరుణగిరి సమీపంలోని కేంద్రియ విద్యాలయం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తుతో పాటు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పటిష్ట నిఘాతో పాటు పెట్రోలింగ్ పార్టీలు గస్తి తిరుగుతాయని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పెర్కొన్నారు.

# గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలి



**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు**

ప్రజాపక్షం/సత్తుపల్లి: గత 35 సంవత్సరాలుగా చెరుకుపల్లిలోని తుమ్మల నగర్ కు చెందిన గిరిజనులు పోడు కొట్టి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని తుమ్మల నగర్ ను సందర్శించిన దండు గిరిజనులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 కంటే ముందు నుండి గిరిజనులు పోడు భూములు సాగు చేసుకుంటున్నారని,భూములు గిరిజనులకు చెందకుండా ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది పెట్టడమే కాకుండా, గిరిజనులపై అక్రమ కేసులు బనాయించి వాళ్లను కోర్టు చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జోక్యం చేసుకొని గిరిజనులకు పోడు పట్టాలివ్వాలని దండు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కమిటీ సభ్యులు తాటి వీరభద్రం, చెరుకుపల్లి శాఖ కార్యదర్శి గడ్డం కృష్ణయ్య, సహాయ కార్యదర్శి తారబోయిన రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు తాటి రాజు, తాటి చిన్న వీరభద్రం, మహిళా సమాఖ్య నియోజకవర్గ కన్వీనర్ ఎస్ కే రంజాన్ బి, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే హమీద్, బి అజయ్, ఎస్ కే లాల్ మహమ్మద్, తాటి కుమారి, తాటి రాజమ్మ, గడ్డం తిరుపతమ్మ, భద్రమ్మ, రాధ, గడ్డం వెంకటేష్, తారబోయిన రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలి

**సిపిఐ, సిపిఎం డిమాండ్**



ప్రజాపక్షం/సత్తుపల్లి: కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం హోం మంత్రి అమీషా ఖగార్ పేరుతో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా మావోయిస్టులపై కిరాతకంగా దాడులు చేస్తూ, వారిని హత మారుస్తూ ప్రజాస్వామ్యానికి గోడ్డలిపెట్టుగా మారారని, ఆపరేషన్ కగార్ ను వెంటనే ఆపాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహం ముందు ఆందోళన నిర్వహించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల హక్కుల రక్షణ కోసం అనేక సంఘాలు, సంస్థలు ఏర్పడ్డాయని, మావోయిస్టులను నిర్మూలించే ఆలోచన మంచిది కాదని వారి యొక్క డిమాండ్స్ పై శాంతియుత వాతావరణం లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించి ఒక శాంతియుత వాతావరణ ఏర్పాటు చేయాలని, ఛత్తీస్గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం తలపిస్తూ కర్రిగుట్టపై వేలాది మంది పోలీసులు దించి ఖగార్ పేరుతో మావోయిస్టులపై దాడులు చేస్తూ వారి ప్రాణాలు తీయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలని, మావోయిస్టులపై దాడులు ఆపాలని అమాయకులైన గిరిజనులను చంపటం ఆపాలని, అదే విధంగా యుద్ధంలో పోలీసులు, మిలటరీ అనేకమంది చనిపోతున్నారని కాబట్టి ఇట్టి యుద్ధాన్ని ఆపి చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, టౌన్ కార్యదర్శి సర్వేశ్వరరావు, సిపిఐ నాయకులు లాల్ మహమ్మద్, మహిళా సమాఖ్య కన్వీనర్ ఎస్ కే రంజాన్ బి, సిపిఐ యువజన సమాఖ్య నాయకులు ఎస్కే హమీద్ బి, అజయ్, మోరంపూడి వెంకట్, భాస్కర్ పాల్గొన్నారు.

# ఉపాధి హామీ ఉద్యోగులకు పర్మినెంట్ చేయాలి

ప్రజాపక్షం/కామేపల్లి: ఎంతోకాలంగా ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులను సిబ్బందికి వెంటనే పే స్కేల్ ఇచ్చి పర్మినెంట్ చేయాలని కోరుతూ శుక్రవారం ఈజిఎస్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు నెలల నుండి జీతాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అయిన ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా తమను గుర్తించి ప్రభుత్వం వెంటనే పే స్కేల్ ఇచ్చి పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అద్దంకి శ్రీ రాణి, ఈసీ దామల వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు బావ్‌సింగ్, భాస్కర్, సుప్రియ, కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు కోటేష్, రమేష్, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వల్లే దేశవ్యాప్తంగా కులగణన

**రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం**



ప్రజాపక్షం/ఇల్లెందు: కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత, ఎంపీ, పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వల్లే దేశవ్యాప్తంగా కులగణన జరిగిందని పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియేల్, నియోజకవర్గ నాయకుడు మడుగు సాంబమూర్తి పేర్కొన్నారు. స్థానిక జగదాంబసెంటర్‌లో ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ,పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్రలో భాగంగా దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో 4వేల కిలోమీటర్ల పైగా పాదయాత్ర చేసి మతాలు, కులాలు, ప్రాంతాల ప్రజలను కలిసి ఆయా రాష్ట్రాల సమస్యలపై పాదయాత్రను కొనసాగించారన్నారు. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ కులగణన చేయాలని అనదంతో కేంద్రప్రభుత్వం ఆలోచించి కులగణన చేసేందుకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కాశ్మీర్‌లోని పహెల్గం పర్యాటకులపై జరిపిన దాడులకు భవిష్యత్‌లో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఉగ్రవాదులపై కఠినచట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పులిసైదులు, నియోజకవర్గ నాయకులు బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, హరిహరక్షేత్ర ఆలయ కమిటీ ఛైర్మన్ గాదె సదానందం, సుదర్శన్ కోరి, వారరవి, అజామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ఏరియాలోని సింగరేణి పాఠశాల 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామ్ చందర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 61 మంది విద్యార్థులకు గాను 59 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 97% సాధించడం సంతోషంగా ఉందన్నారు. 552 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన కే తేజశ్రీని, 543 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన టి. సాయి చరణ్ ను, 500 లకు పైగా మార్కులు సాధించిన పది మంది విద్యార్థులను విద్యార్థులను అభినందిస్తూ ముందు ముందు ఇంకా పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. ఈ ఫలితాల సాధనకు కృషిచేసిన ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎస్ రమేష్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కళ్యాణి, ఉపాధ్యాయులు ఎం కృష్ణ బాబు, రాజసింహ, లలిత, మమత, స్రవంతి, ఎం.చత్రు నాయక్ పాల్గొన్నారు.

# అర్హుల జాబితా పకడ్బందీగా రూపొందించాలి

ప్రజాపక్షం/బూర్గంపాడు: రాజీవ్ యువ వికాసం పథకం కొరకు నిరుద్యోగులైన గిరిజన యువతి యువకులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారి జాబితా పగడ్బందీగా రూపొందించాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వేపలగడ్డ, నకిరిపేట గ్రామాలలోని గ్రామ పంచాయితీలలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలనను ఆయన పర్యవేక్షించారు. ఈసందర్భంగా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జాబితా రూపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా గిరిజన నిరుద్యోగుల దరఖాస్తులను చాలా క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి తప్పని సరిగా రుణాలు అందే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకర్ల సమన్వయంతో ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పుస్తకం, సదరం సర్టిఫికెట్, ఇతర ధృవీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. జనాభా ప్రాతిపదిక కలిగిన యూనిట్ల కేటాయింపు ఉంటుందని, ఒకే గ్రామంలో ఒక యూనిట్టు ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకుంటే వాటిని పరిశీలించాలని, వ్యవసాయ సంబంధిత యూనిట్ల స్థాపనకు ప్రజలకు అవగాహన కల్పించాలని, చేపల పెంపకం యూనిట్లను ఈ పథకం ద్వారా స్థాపించడం ద్వారా వారి యొక్క ఆర్థిక పురోగతి ఉంటుందని అన్నారు. అదే విధంగా పాడి పరిశ్రమలు స్థాపనకు ప్రోత్సహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, ఎస్ఓ భాస్కర్, స్పెషల్ ఆఫీసర్ అశోక్‌కుమార్, ఎంపీవో బాలయ్య, వేపలగడ్డ పంచాయితీ సెక్రటరీ బిందు, నకిరిపేట పంచాయితీ సెక్రటరీ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

# గీత దాటితే వేటు తప్పదు

**- సామ శ్రీనివాస్‌రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేశాం**



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : బిఆర్ఎస్ పార్టీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, గీత దాటితే వేటు తప్పదని పార్టీ మండల అధ్యక్షులు భాషబోయిన వీరన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షులు తాత మధుసూదన్, పాలేరు మాజీ శాసనసభ్యులు, ఇన్‌చార్జి కందాళ ఉపేందర్ రెడ్డి ఆదేశాల మేరకు రాజారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు సామ శ్రీనివాస్‌రెడ్డిని బిఆర్ఎస్ పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. తల్లి లాంటి పార్టీలో ఉంటూ పార్టీ నిర్ణయాలకు పార్టీ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పాల్పడుతూ పార్టీలో ఉంటున్న నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న సామ శ్రీనివాస్‌రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేసినట్టు, శ్రీనివాస్‌రెడ్డికి బిఆర్ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వివిధ పదవులు అనుభవించిన కొందరు నాయకులు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిని ఎంతటి వారినైనా పార్టీ నుండి బహిష్కరిస్తామని ఆయన అన్నారు. అధికారం కోల్పోయినంత మాత్రాన నాయకులు, కార్యకర్తలు అసహనానికి గురి కావద్దని, వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతిఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని తెలిపారు.

# ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం..

**-రైతులు ఆందోళన చెందనవసరం లేదు**
**-వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ సీతారాములు**



ప్రజాపక్షం/నేలకొండపల్లి : గత రాత్రి కురిసిన వర్షం వలన ధాన్యం కొంత మేరకు తడిసిందని రైతులు ఆందోళన చెందనవసరం లేదని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూస సీతారాములు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ లో తడిసిన ధాన్యం ను శుక్రవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఏ మేరకు ధాన్యం తడిసినవి అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు అధైర్యపడొద్దని సూచించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు. కేంద్రాలకు వచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని తెలిపారు. రైస్ మిల్లులు ఖాళీలు లేకపోవటం వలన ఎగుమతుల జాప్యం జరుగుతుందనిఅన్నారు. మంత్రి ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ధాన్యం ను తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రెండు, మూడు రోజులలో ధాన్యం అంతా మిల్లులకు తరలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ నాయకులు కొడాలి గోవిందరావు, నల్లాని మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు పారదర్శంగా నిర్వహిస్తున్నాం

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రెవెన్యూ,గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో దరఖాస్తులు పరిశీలించి సంతకం చేయడం ద్వారానే లబ్ధిదారుల గుర్తింపు చేపడుతున్నట్లు తెలిపారు. పేదల్లో బహుపేద వారిని మాత్రమే గుర్తించి వారికి లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రభుత్వం నిబంధనలు, సూచనల మేరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా క్షేత్రస్థాయి నుండే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్ లో ట్రైనీ కలెక్టర్ సౌరబ్‌శర్మ, కొత్తగూడెం ఆర్‌డిఓ మధు, హౌసింగ్ పిడి శంకర్, సుజాతనగర్ తహశిల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# నీట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

**- జిల్లాలో మొత్తం 3 పరీక్షా కేంద్రాలు**
**- ఎస్‌పి రోహిత్ రాజ్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** నీట్ పరీక్షా కేంద్రాలవద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా మొత్తం సెంటర్లు ఏర్పాటు చేశారని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. ఈనెలవ తేది మధ్యాహ్నం 20. నుండి సాయంత్రం 5 గం. వరకు నీట్ ప్రవేశ పరీక్ష ఉంటుందని, కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ కాలేజీ, పాల్వంచలోని టిజిఎస్ డబ్ల్యూ ఆర్‌ఎస్ స్కూల్, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ లలో పరీక్షా కేంద్రాలు ఉంటాయని చెప్పారు. ఈ మేరకు విధులు నిర్వహించే సిబ్బందితో ఎస్‌పి తన కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యర్థులను 11 గం. నుండి 1.30 వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించాలని, అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, చైన్లు, చెవిదిద్దులు, తాయత్తులు, రింగులు, మెట్టెలు, బ్యాగులు పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరాదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో పాటుగుర్తింపు కార్డు,రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకురావాలి. పరీక్షాకేంద్రాలు పూర్తిగా సిసి కెమోరాల ఆధీనంలో ఉంటాయని తెలిపారు. పరీక్షా కేంద్రంలో బ్లాక్ పాయింట్ పెన్నులు ఇస్తారని తెలిపారు. నిబంధనలకు తూచా తప్పకుండ పాటించాలని చెప్పారు.

# కేంద్ర ప్రభుత్వం నల్లచట్టాలను వెనక్కి తీసుకోవాలి

**- సిపిఐ జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ**



**ప్రజాపక్షం/చర్ల :** కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బిజెపి ప్రభుత్వం నల్లచట్టాలను వెనక్కు తీసుకోవాలని సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ అన్నారు. చర్ల మండల పరిధిలోని సిపిఐ గ్రామశాఖలు, కార్మిక అడ్డాల్లో సిపిఐ ఏఐటియూసి అనుబంధ సంఘాలు, ప్రజా సంఘాలు బిల్డింగ్, హమాలీ, పెయింటింగ్ వర్కర్స్, ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మే డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దప్పువాయిద్యాలు, నృత్యాల నడుమ తొలుత సిపిఐ కార్యాలయంలో ఎర్రజెండాను సిపిఐ జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ ఎగురవేశారు. అనంతరం ఏఐటియూసి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి గుంజి మాల్యాద్రి ఏఐటియూసి పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం చర్ల బస్టాండ్ వద్ద సిపిఐ మండల కార్యదర్శి నూపా పోతయ్య, అంబేద్కర్ సెంటర్‌లో పింగళి రాము, సూపర్ బజార్ సెంటర్‌లో ఏఐటియూసి పతాకాన్ని సాయిల తిరుపతిరావు, హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద ఏఐటియూసి పతాకాన్ని రవి ఏకయ్య ఎదురవేశారు. తిప్పాపురంలో నూపా మోతీర్, పెద్దమిడిసిలేరులో పొలంచ రామారావు, నాయకకొత్తూరులో, బెస్తకొత్తూరులో పాలెం సత్యనారాయణ, మునిగిల రామారావు, తేగడలో కోడిరెక్కల రాజారావు, ఏఐటియూసి పతాకాన్ని వాసం నాగేశ్వరరావు, కుదునూరులో కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీ నారాయణ, కలివేరులో నాని పెల్లి భద్రం, మల్లం నాగేశ్వరరావు, ఏఐటియూసి పతాకాన్ని ఉప్పలూరి రాంబాబు ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో ఉప్పలూరి వెంకట నర్సమ్మ, ఉప్పలూరి నాగరాజు, సిరిగిరి దుర్గారావు, నంబూరి నాగేశ్వరరావు, అనీల్, రాజేష్, వెంకట్రావు, సత్యనారాయణ, ఆదినారాయణ, రాము, నర్సింహారావు, మహేష్, తేజ, సిపిఐ, ఏఐటియూసి అనుబంధం సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మే డేస్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సిపిఐ ఖమ్మం జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు పేర్కొన్నారు. నేలకొండపల్లి మండలం లోని భైరవునిపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం గ్రామ సీపీఐ సీనియర్ నాయకుడు పోలంపల్లి జాన్ అరుణ పతాకాన్ని ఎగరవేసి మేడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకబండి సీతారాములు మాట్లాడారు. కార్మిక హక్కుల కోసం కార్మికుల పని గంటలు తగ్గదల కోసం, కార్మికుల వేతనాల పెంపు కోసం, సరైన పనికి సరైన వేతనం కొరకు సాగిన పోరాటంలో చిన్నినాయన రక్తమే ఈ ఎర్రజెండా ఎన్నో వందల సంవత్సరాలు పోరాడి కొట్లాడి తెచ్చుకున్న ఈ హక్కులను మనం కాపాడుకోవాలి అన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. కార్మిక చట్టాలను అదాని, అంబానీ బడాబడా వ్యాపారవేత్తల వద్ద నరేంద్ర మోడీ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని విమర్శించారు. పోరాడితే పోయేదేమీ లేదని బానిస సంకెల తప్ప అనే నినాదాలు మనం గొంతే చాటాలని పేర్కొన్నారు. మన హక్కుల సాధన కోసం మళ్లీ మనం ఉద్యమించాలని, కార్మిక హక్కులను విస్మరిస్తున్న మోడీ ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాలను నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు ఆలేటి మహేష్, గ్రామ శాఖ కార్యదర్శి పోలంపల్లి నారాయణ, సహాయ కార్యదర్శి చుట్టూ వెంకన్న, కార్యవర్గ సభ్యులు ముత్యాల వేంకటేశ్వర్లు, బాలేబోయిన వేంకటేశ్వర్లు, చిలివేరు రేణుబాబు, బోల్లం ఉపేందర్, భధ్రజీ వేంకటేశ్వరరావు, బాలిన కృష్ణంరాజు, బాలిన నారాయణ, మరికంటి ఉపేందర్ రావు, పెద్దపాక నాగరాజు, బాలిన రామకృష్ణ, పూజాల శాకయ్య తదితరులు పాల్గొన్నారు.



# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/కామేపల్లి:** ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ అన్నారు. శుక్రవారం తెలంగాణ రైతు సంఘం బృందం బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న పంటలను, మిర్చి, ధాన్యం కల్లాలను కామేపల్లి, ముచ్చర్ల, జాస్తిపల్లి, బాసిత్‌నగర్ తదితర గ్రామాల్లో పరిశీలన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అనేక గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు గాలి, వర్షంకి రాలిపోవడం జరిగిందన్నారు. బొప్పాయి తోటలు పూర్తిగా విరిగి పడిపోయి రైతులకు నష్టం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసి పోయిందని, మిర్చి, మొక్కజొన్న రైతులకు కూడా నష్టం వాటిల్లిందన్నారు. ఒక ప్రక్క సరైన ధర లేక మిర్చి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరోవైపు అకాల వర్షాలు కురిసి కల్లాల్లో ఉన్న మిర్చి తడిసి పోయిందన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం కామేపల్లి మండల అధ్యక్షులు రాయల సత్యనారాయణ, వీరభద్రం, రాములు, అమరనేని కృష్ణ, మాదపాటి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు అభినందనలు

**ప్రజాపక్షం/కారేపల్లి:** పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులై 600 మార్కులకు 592 మార్కులు సాధించిన అఖిలేష్, పూజితలను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇదే ఉత్తేజంతో భవిష్యత్ కాలంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, నడియాడిన నేలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# గ్రామదేవతల విగ్రహప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ఇల్లెందు:** నియోజకవర్గంలోని మండలం కోయగూడెం గ్రామంలో ఘనంగా నిర్వహిస్తున్న బొడ్రాయి, ధ్వజస్థంభం, ఆంజనేయస్వామి, ముత్యాలమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలలో ఎమ్మెల్యే కోరం కనకయ్య కుటుంబ సభ్యులు పాల్గొని వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యలక్ష్మి దంపతులతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోరం సురేందర్ ఉమ దంపతులు పాల్గొన్నారు.



# సింగరేణి ఉద్యోగిపై కత్తితో దాడి

**ప్రజాపక్షం/ఇల్లెందు:** సింగరేణి ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న కొందూరి చిన్నాపై గురువారం రాత్రి కత్తితో పలిపిరెడ్డి సందీప్ దాడి చేసిన సంఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని రిమాండ్‌కు తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగరేణి ఉద్యోగిగా పనిచేస్తున్న కొందూరి చిన్న పట్టణంలోని నెం14బస్తీకి చెందిన తన సహోద్యోగి కొప్పుల కోటయ్య ఇంటికెకి వెళ్లి తన ద్విచక్రవాహనాన్ని సందీప్ ఇంటి ముందు నిలిపినారు. గతంలో నుంచి సందీప్, కోటయ్యకు మధ్య ఘర్షణలు ఉండటంతో కత్తితో కోటయ్యపై దాడి చేసే క్రమంలో చిన్నా అడ్డురావడంతో మెడ పైభాగంలో తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. ప్రథమచికిత్స నిర్వహించిన అనంతరం బాధితుడు చిన్నా ఫిర్యాదు మేరకు 109బీఎన్ఎస్ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.

# చికిత్స పొందుతూ జెసీబీ డ్రైవర్ మృతి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రమాదవశాత్తు రైస్ మిల్లు కి చెందిన బూడిదలో పడటంతో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని ఓ రైస్ మిల్లు లో గత నెల 19 న ప్రమాదవశాత్తు మిల్లులో బూడిద ను పక్కకు నెట్టేందుకు నేలకొండపల్లి కి చెందిన జెసీబీ ని పిలిపించారు. జెసీబీతో బూడిదను పక్కకు జరుపుతుండగా...ప్రమాదవశాత్తు జేసీబీ డ్రైవర్ ఉపేందర్ బూడిదలో పడ్డాడు. మంటలు తట్టుకోలేక ఆరవటంతో స్థానిక హమాలీలు, మిల్లులో పని చేసే ఇతర కార్మికులు ఘటనా స్థలం కు చేరుకుని అతి కష్టంగా బయటకు తీశారు. అప్పటికే ఒంటి నిండా బొబ్బలు వచ్చి తలు ఊడిపోతున్నాయి. వంటిని మరుగైన వైద్యం కెనెరే ఖమ్మం తరలించారు. పరిస్థితి విషమించటంతో హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కాగా మృతుడు కుటుంబ సభ్యులు మిల్లు యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఇదే మిల్లులో ఇటీవల ఓ కార్మికురాలు కూడ ప్రమాదం జరిగింది. మిల్లు యాజమాన్యం తగిన సౌకర్యాలు కల్పించటంతో నిర్లక్ష్యం వహిస్తున్నారని, అందు వలనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి మిల్లులో సౌకర్యాలపై సమగ్ర విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మే 3న చలో బస్ భవన్

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నేడు జరిగే చలో బస్ భవన్ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎన్టీయూసి కార్మిక సంఘం పిలుపు నిచ్చింది.ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బస్ భవన్ ముందు నిరసన కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఐఎన్టియూసి నాయకులు ఎన్ రామకృష్ణ, గడ్డం శ్రీనివాసరావు, హనుమంతరావులు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ గడ్డం శ్రీనివాస్, స్టేట్ నాయకుడు హనుమంత్, రీజియన్ సెక్రటరీ ఎన్.ఆర్ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# టీమ్ వర్క్‌తోనే అభివృద్ధి సాధ్యం



**-సింథటిక్ రన్నింగ్ ట్రాక్ నిర్వహణకు పక్కా ప్రణాళిక**
**-20 ఎకరాలలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి**
**-సింథటిక్ రన్నింగ్ ట్రాక్, టేబుల్ టెన్నిస్ హాల్, ఫుట్‌పాత్‌ల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఒక సంస్థ అభివృద్ధిలో నడవాలంటే టీమ్ వర్క్ చాలా ముఖ్యమని ఒక్కరి వల్ల ఏది సాధ్యం కాదని టీమ్ వర్క్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంపి రామసహయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి సర్దార్ పటేల్ మైదానంలో రూ. 8.50 కోట్లతో చేపట్టిన సింథటిక్ రన్నింగ్ ట్రాక్ , రూ. 50 లక్షలతో చేపట్టిన టెన్నిస్ షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సింథటిక్ రన్నింగ్ ట్రాక్ తెలంగాణ రాష్ట్రంలో ఐదు చోట్ల మాత్రమే అందుబాటులో ఉందని ఖమ్మం నగరంలో ఆరవ సింథటిక్ రన్నింగ్ ట్రాక్ నిర్మించుకుంటున్నామన్నారు. ఈ సౌకర్యం కల్పించడం వల్ల భవిష్యత్తులో ఖమ్మం నుంచి మంచి క్రీడాకారులు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సింథటిక్ రన్నింగ్ ట్రాక్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని రన్నింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు నిర్వహణ కూడా పక్కా ప్రణాళిక రూపొందించాలన్నారు. పిల్లలకు మంచి శిక్షణ అందించేవిధంగా కోచ్‌లను ఎంపిక చేయాలన్నారు. క్రికెట్ క్రీడాకారులకు మైదానాన్ని ఏర్పాటు చేసేందుకు 20 ఎకరాల భూమిని గుర్తించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆర్డీవోకు సూచించారు. వైద్య కళాశాల సమీకృత గురుకులాలతో పాటు ఖమ్మంకు అందుబాటులో ఉండేలా పెద్ద మైదానాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానన్నారు. ఒక సంస్థ, వ్యవస్థ నడవాలంటే టీమ్ వర్క్ చాలా ముఖ్యమన్నారు. పాలన పరంగా అధికారులు, ప్రజాప్రతినిధులు బృందంగా పనిచేస్తే భవిష్యత్తు తరాలకు మెరుగైన వసతులు కల్పించవచ్చునన్నారు. దేశంలో క్రీడలు మరింత పెరగాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి సైతం క్రీడలకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. సర్దార్ పటేల్ మైదానం అభివృద్ధికి ఎటువంటి అవసరాలు ఉన్నా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని, క్రీడల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. ఎంపి రఘురాం రెడ్డి మాట్లాడుతూ సింథటిక్ రన్నింగ్ ట్రాక్ ఖమ్మంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషమన్నారు. గతంలో 400 మీటర్ల పరుగు పందెంలో తాను పాల్గొన్నానని ఎంపి గుర్తు చేశారు. గతంలో మన దగ్గర సింథటిక్ ట్రాక్ ఉండేది కాదని బొగ్గుతో తయారు చేసిన ట్రాక్ పై అభ్యాసం చేసేవారమన్నారు. హాకీ క్రీడ కోసం ట్రాక్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని అధికారులకు తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం ఖమ్మం నగరంలో సర్దార్ పటేల్ మైదానానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారని నేడు అదే మైదానంలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నారన్నారు. ఖమ్మం మైదానంలో ఉన్న వసతులు రాష్ట్రంలోని ఏ ఇతర జిల్లాల్లోని మైదానాల్లో లేవన్నారు. క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చి అభివృద్ధి సహకరిస్తున్న మంత్రికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆర్థికాభివృద్ధితో పాటు వారి మానసిక ఉల్లాసం , శారీరక ఎదుగుదలకు దోహదపడే క్రీడలను జిల్లాలో ప్రోత్సాహించడం సంతోషకరమన్నారు. అనంతరం సర్దార్ పటేల్ మైదానంలో శిక్షణ తీసుకున్న క్రీడాకారులు ఇటీవల నిర్వహించిన సిఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎక్కువ పతకాలు సాధించిన సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా ఐటి హబ్ నుండి ఎన్‌టిఆర్ సర్కిల్ వరకు రూ. 1.25 కోట్లతో నిర్మించనున్న ఫుట్ పాత్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డివో టి. సునీల్‌రెడ్డి, ఆర్డీవో జి.నర్సింహారావు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, క్రీడా అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు, అధికారులు పాల్గొన్నారు.

# విపత్తు నష్ట నివారణకు ముందస్తు ప్రణాళికలు

**-అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలి**
**-విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, సిపి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విపత్తుతో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు కార్యచరణ ప్రణాళిక చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విపత్తు నిర్వహణపై రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు సన్నద్ధతపై కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తు పట్ల ముందస్తు ఏర్పాట్లతో అధికారులు హెడ్ క్వార్టర్స్‌లో ఉంటూ సన్నద్ధంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రజలకు కష్టం కలుగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వర్షాలు వచ్చినప్పుడు ముంపు ప్రాంతాలు, ప్రమాదకర నీటివనరుల పట్ల ముందస్తు మ్యాపింగ్ చేసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల, మున్సిపాలిటీ స్థాయిలో వారి వారి పరిధిలో ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయో గుర్తించి వాటిని సరిదిద్దాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉన్న వారిని ముందు రోజే సురక్షిత ప్రాంతానికి చేర్చాలన్నారు. ఇందుకు ప్రతి గ్రామంలో ఒక భవనాన్ని గుర్తించి సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రతి మురికి కాలువను ప్రారంభం నుంచి తుది వరకు పరిశీలించి పడ్డ వర్షం బయటకు వెళ్తుందా అన్నది చూడాలని ప్రతి మురికి కాలువను డిసిల్టింగ్ చేసి ఎక్కడ నీరు ఆగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆపద మిత్ర క్రింద యువతీ, యువకులను గుర్తించి విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 139, పట్టణ ప్రాంతాల్లో 161 మంది యువతను ఆపద మిత్ర క్రింద ఎంపిక చేసి 10 రోజులు క్లాస్‌రూము శిక్షణ, క్షేత్ర శిక్షణనిచ్చి వైద్య పరీక్షలు చేపట్టి వారికి ఫిట్‌నెస్ పరీక్షలు చేసి జీవిత బీమా చేయించినట్లు తెలిపారు. గ్రామస్థాయి నుండి అధికారులు ఆపద మిత్ర, ఫిషర్‌మెన్, ఈతగాళ్లతో వాట్సాప్ గ్రూప్ ఏర్పా టు చేసి సమాచారం అందిపుచ్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తు సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడానికి ప్రతి గ్రామం, వార్డులో పోర్టబుల్ మైకేసెట్ సిద్ధం చేసుకుని ఉంచుకోవాలన్నారు. గ్రామ, వార్డుల వారీగా ప్రభావిత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలింపుకు పునరావాస కేంద్రాలను గుర్తింపు చేసి కావాల్సిన సామాగ్రిని సిద్ధం చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రమాదకర మేజర్ రోడ్లను ముందస్తుగా ఆర్టిసి బస్సులతో బ్లాక్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటకులు ప్రమాదకర ప్రదేశాల్లో ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండి ముంపు ప్రాంతాల్లో ఉన్న మేజర్ టవర్లకు ఏమైనా ఇబ్బందులు కలిగే సూచనలు ఉన్న చోట ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలో 1077 నెంబర్‌తో కంట్రోల్ రూము పని చేస్తుందని, మండల కేంద్రాల్లో ల్యాండ్ లైన్ ఫోన్లను క్రియాశీలం చేసి కంట్రోల్ రూము ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ గత అనుభవం దృష్ట్యా ఏమి జరిగింది, ఏమి చేశాం, ఏమి చేయాలనే ఆలోచన చేయాలన్నారు. ప్రతి శాఖ నుండి విపత్తు నిర్వహణకు ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ శాఖ నుంచి విపత్తు ఎదుర్కొవడానికి బృందాలను సిద్ధం చేసి శిక్షణనిచ్చినట్లు తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ డిఆర్‌ఎఫ్ బృందాలను డివిజన్ల వారీగా విభజించి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. నాలా, డ్రైన్ల క్లియర్‌కు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గత వరదల నుంచి ఎంతో నేర్చుకున్నట్లు నష్టం జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డా॥పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి సిపిఐ



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తూ పేదల పక్షపాతిగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నిలిచిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం తెలిపారు. శుక్రవారం త్రీటౌన్ ప్రాంతంలోని శ్రీనివాసనగర్‌లో 27వ డివిజన్ సిపిఐ మహాసభ నిర్వహించారు. ఈ సభలో సలాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఆయన తెలిపారు. సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు నిర్వహించి ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. త్రీటౌన్ ప్రాంతంలో సిపిఐకి పూర్వ వైభవం వస్తుందని ఆయన తెలిపారు. అనంతరం 27వ డివిజన్ సిపిఐ కమిటీని ఎన్నుకున్నారు. 27వ డివిజన్ శాఖ కార్యదర్శిగా నామ విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా డి. గోపి, మహబూబ్ పాషా, నామ నాగరాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు భూక్యా రవీంధర్, 27వ డివిజన్ నాయకులు శ్రీధర్, శ్రీనివాస్, సతీష్, సుమన్, హుస్సేన్, నాగులు, శ్రీనివాస్, మాధవ్, లింగయ్య, సలీం, సురేష్ పాల్గొన్నారు.

## ఏఎంసి ఛైర్మన్‌ను పరామర్శించిన టిఎన్‌జీవోస్ నేతలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు కుటుంబాన్ని టిఎన్‌జీవోస్ నేతలు పరామర్శించారు. ఇటీవల యరగర్ల హన్మంతరావు తండ్రి యరగర్ల పిచ్చియ్య మృతి చెందారు. శుక్రవారం వి. వెంకటాయపాలెంలోని వారి నివాసానికి టిఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాయల నర్సింహారావు, టిఎన్‌జీవోస్ జిల్లా జాయింట్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్, కృష్ణయ్య తదితరులు వెళ్లి పిచ్చయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

## మజీద్ నూతన కమిటీ సదర్‌గా ఫయాజ్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని మజీద్ ఎ ఖుబా కమిటీ అధ్యక్షులుగా ఎండి ఫయాజ్ నియమితులయ్యారు. గతంలో అధ్యక్షులుగా పనిచేసిన అఫ్జల్ సాహెబ్ విదేశీ పర్యటనలో ఉండడంతో ఫయాజ్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఉపాధ్యక్షులుగా ఎండి ఖలీముద్దీన్, ప్రధాన కార్యదర్శిగాషేక్ ఖాసీం తదితరులు ఎన్నికయ్యారు. నూతన కమిటీని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ సాధిక్ అలీ అభినందించారు. కమిటీ బాధ్యులను గతంలో బాధ్యతలు నిర్వర్తించిన వారిని శాలువలతో సన్మానించారు. ఈసందర్భంగా సాధిక్ అలీ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేసేంత వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు.

**కమ్యూనిస్టు యోధుల సేవలు ప్రశంసనీయం...**

కమ్యూనిస్టు పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేసి పేదల అభ్యున్నతి కోసం పనిచేసిన వారి సేవలు ప్రశంసనీయమని రాజ్యాంగ పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ సాధిక్ అలీ తెలిపారు. గతంలో రజబ్‌అలీ విశేష కృషి చేశారని వారిని నిత్యం స్మరించుకుంటామని సాధిక్ అలీ తెలిపారు. మంగళవారం కమ్యూనిస్టులుగా పనిచేసిన పలువురిని ఆయన శాలువలతో సన్మానించారు. తనికెళ్ల మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, కొత్తపల్లి నారాయణరావు, ఖమ్మంలో మహ్మద్ సలాం ను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి అధ్యక్షులు సుభాని తదితరులు పాల్గొన్నారు.

## మే 5 నుండి రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమాలు

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు, వానా కాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు ఈనెల 5 నుండి జూన్ 13వ తేదీ వరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరధిలోని అశ్వారావుపేట వ్యవసాయకళాశాల శాస్త్రవేత్తలు 8 బృందాలుగా ఏర్పడి ఆరు వారాల పాటు అశ్వారావుపేట, దమ్మపేట, సత్తుపల్లి, వేంసూరు, ములకలపల్లి మండలాల్లో 48 గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ అధికారుల సమన్వయంతో నిర్వహించనున్నారు. ఈ బృందాల్లో ఇద్దరు వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులతో పాటు వ్యవసాయ విద్యార్థులు కూడా పాల్గొని రైతు సోదరులకు ఆరు అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది. రైతు సోదరులు అధికసంఖ్యలో ఈ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంతకుమార్ విజ్ఞప్తి చేశారు.